# ప్రయాణం

బి. విద్యాసాగర్




నేను విజయవాడలో బంధువుల యింట్లో పెళ్ళికి వెళ్ళి, హైదరాబాద్ తిరిగి రావడానికి రైలు కంటే, బస్సులో తొందరగా రావచ్చుననీ, ఆలోచించాను. నిజానికి నేను రైలు తిరుగు ప్రయాణానికి రిజర్వేషన్ చేయించుకోలేదు. ఆరోజు రాత్రి 9 గం. ప్రాంతంలో బస్సుకోసం యెదురు చూస్తున్నాను. ఇంతలో మా తాలూకా యం.యల్.ఏ.(శాసన సభ్యుడు) కనిపించాడు. ఆయనను చూసి —

"నమస్కారమండీ ! ఏమిటి మీరుకూడా హైదరాబాద్ వస్తున్నారా!" అన్నాను వెంటనే.

"అవునండీ ! నేను ఈ వూళ్ళో కొద్దిగా పని వుండి వచ్చాను మళ్ళీ అసెంబ్లీ సెషన్స్ దగ్గరకు వస్తున్నాయి కదా ! అందుకని హైదరాబాద్ బయలుదేరాను."

"ఏమిటి ! మీరు కూడా మాతోపాటు బస్సులో కానీ, రైలులో కానీ, ప్రయాణం చేయవలసినదేనా ! హాయిగా కారులో వెళ్ళ కూడదూ !" అన్నాను నవ్వుతూ.

"నాకు కారు యెక్కడనుంచి వస్తుంది నాయనా ! నేను యేమయినా మంత్రి నయితే, అలాగే మీరు చెప్పినట్లు హాయిగా కారులో వెళ్ళేవాడిని ! నాకు ఆ ఛాన్సు రాలేదు. పోనీ స్వంత కారు కొనుక్కోవడానికి నాకూ దానితో అవుసరం లేదు. కొనుక్కునే ఆర్థికస్తోమత లేదు" అన్నాడు.

"అదేమిటండీ! మీరు కూడా మాలాంటి వుద్యోగస్థులలాగా మాట్లాడుతారు? మీకు యం. యల్. ఏ. గా ప్రభుత్వం కొంత యిస్తుంది; మీకు మనవూళ్ళో బాగా ఆస్తిపాస్తులు వున్నాయి" అన్నాను.

"ఆస్తి వుందని విలాసాలకి డబ్బు దుర్వినియోగం చేసుకుంటామా? ఏది అవుసరమో, అదే కొనుక్కుంటాము. నా దృష్టిలో అనవసరం అనిపిస్తే, నయా పైసా ఖర్చు పెట్టను" అన్నాడాయన.

"మీరు హాయిగా యే మంత్రిగారు కారులోనయినా హైదరాబాద్ వెళ్ళక పోయారా!" అన్నాను.

"బాగుంది! మీరు చెప్పేది! ఎవరయినా మంత్రిగారు మన తాలూకాలో పర్యటనకు వస్తే, అప్పుడు ఆయన వెంట తిరిగితే బాగుంటుంది ! అంతేకానీ, మిగతా సమయాలలో వాళ్ళ వెంట తిరగడం నాకు యిష్టం వుండదు."

"అహ! అదికాదు ! యెవరయినా మినిష్టరు యిప్పుడు విజయవాడకు టూరులో వస్తే, ఆయనతో వెళ్ళితే మీరు హాయిగా వెళ్లవచ్చును. త్వరగా హైదరాబాద్ చేరుకోవచ్చును."

"ఇప్పుడు యే మంత్రి టూర్‌లో లేరు. అయినా వాళ్లతో వెళితే బాగుండదు! మంత్రిగారు కారుకి తగిన సిబ్బంది ఆయన వెంట యెప్పుడూ వుంటుంది" అన్నాడు ఆయన జోక్ చేస్తూ.

"అంటే పి.ఏ. బంధువులు, స్నేహితులు లాంటి వారా !" అన్నాను నేను కూడా నవ్వుతూ.

"కరెక్టు! కారుకు సరిపడ్డ జనం వుంటారు" అన్నాడు. ఇంతలో హైదరాబాద్ వెళ్ళే బస్సు వచ్చింది.

మేము యిద్దరం బస్సు యెక్కాము. మావూరి కబుర్లు, హైదరాబాద్ విశేషాలు, సినిమాలు, రాజకీయాలు గురించి కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేశాము. మా యిద్దరికీ పక్క పక్క సీట్లు దొరికాయి. అది మా అదృష్టం! బస్సుకు సరిపడా జనం యెక్కారు. బస్సు కదిలింది. జోరుగా పోతున్నది. రైలు అయితే, యే బెర్తు అయినా రిజర్వు చేసుకుని నిద్ర పోవచ్చును. బస్సులో అదేమీ కుదరదు కదా ! తెల్లవార్లు జాగరణ చేయవలసినదే! ఆ రోజు శివరాత్రి అయినా బాగుండేది! జాగరణ చేసినందుకు

పుణ్యం వచ్చేది! కానీ ఆ రోజు అమావాస్య! మంచిరోజు చూసుకుని ప్రయాణం చేయడానికి ఆఫీసువాళ్ళు శలవు యివ్వరు కదా! అందువలన ఆ రోజు గత్యంతరంలేక తిరుగు ప్రయాణానికి పూనుకున్నాను. మర్నాడు నేను మా ఆఫీసులో డ్యూటీలో చేరాలి.

బస్సు యేదో వూళ్ళో ఆగింది. అక్కడ జనం బాగా బస్సు నిండా యెక్కారు. కండక్టర్ అందుకు అభ్యంతరం చెప్పలేదు. రాత్రిపూట వాళ్ళకు బస్సు యెక్కడ దొరుకుతుందని సానుభూతితో స్టాండింగ్ పాసింజర్సును యెక్కించుకున్నాడు. కానీ డ్రైవరుకు అది యిష్టంలేదు. అది రూల్సుకు వ్యతిరేకమని వాదిస్తాడు. బస్సు అరగంట పైగా ఆ వూళ్ళో డిటెయిన్ చేశారు. ఈ అరగంటలో నేను, యం యల్. ఏ. గారు, కాఫీ త్రాగివచ్చి బస్సు యెక్కాము. మా సీట్లలో సూట్‌కేసు, హేండ్‌బాగ్ వున్నాయి. అదీకాక, కండక్టర్‌కు చెప్పాము కనుక, మా సీట్లు యెవరూ ఆక్రమించుకోలేదు. మేము వచ్చి సీట్లలో కూర్చోగానే, కండక్టర్‌తో "ఏమిటి ఆలస్యం! బస్సు యింకా బయలుదేరదేమిటి!" అన్నాను.

"ఏమి చేయమంటారు! ఇక్కడ బస్సు నిండా జనం యెక్కారు! అది డ్రయివర్‌కు యిష్టంలేదు. బస్సు పోనిమ్మంటే డ్రయివర్ ఇంజన్ స్టార్ట్ చేయడంలేదు!" అన్నాడు.

"అదేమిటి! అతని సంగతి యేమిటో నేను కనుక్కుంటాను వుండు" అంటూ యం.యల్.ఏ గారు రంగంలోకి దూకాడు.

ఆయన వెళ్ళి డ్రయివర్‌తో "ఏమిటయ్యా! బస్సులో స్టాండింగ్ పాసింజర్సు వున్నారు అని, బస్సును ఈ వూళ్ళో గంటసేపు లేటు చేస్తారా! అది తప్పు కదూ! మీ మూలంగా మాకు ఆలస్యం అయిపోవడం లేదా!" అన్నాడు కోపంగా.

"బస్సులో స్టాండింగ్ ప్యాసింజర్సును తీసుకోకూడదండీ డిస్ట్రిక్ట్ సర్వీసులో! అది మా రూల్సుకు వ్యతిరేకం!" అన్నాడు.

"రూల్సు సంగతి ఆలోచిస్తుంటే, ప్యాసింజర్సుకు లేటు అయిపోవడం లేదా!" అన్నాను నేను.

"నాకూ, అతనికీ పడదండీ! మేము యిద్దరం చెరొక యూనియన్‌కి చెందినవాళ్ళమండీ!" అన్నాడు అసలు రహస్యం బయట పెడుతూ డ్రయివర్.


"అదా సంగతి! మీరు ఇద్దరూ చెరొక యూనియన్ వాళ్ళని ప్యాసింజర్సును ఇబ్బంది పెడతారా!" అన్నాడు యం. యల్. ఏ.

"అది కాదండీ! ఓవర్ లోడింగ్ చేస్తే వచ్చే బస్సు డిపోలో మమ్మల్ని సంజాయిషీ అడుగుతారు. నాకు సంజాయిషీ చెప్పడం ఇష్టంలేదు. అదీగాక కండక్టర్ స్టాండింగ్ ప్యాసింజర్లు చాలామందికి టికెట్లు యివ్వకుండా డబ్బులు జేబులో వేసుకుంటాడు. ఇది మా ఆర్. టి. సి. రూల్సుకు వ్యతిరేకం! కార్పొరేషన్‌కు అన్యాయం చేయడం కాదా!" అన్నాడు డ్రయివర్.

వెంటనే యం. యల్. ఏ. కండక్టర్‌ని బస్సులో ప్రయాణీకులకు అందరికీ టికెట్లు యిచ్చాడో, లేదోనని ఆరాతీశాడు. కండక్టర్ "అందరికి టికెట్లు యిచ్చానండీ! డ్రయివర్ చెప్పేదంతా పచ్చి అబద్ధం! కావాలంటే మీరు పాసింజర్సును కనుక్కోండి" అనాడు.

యం. యల్. ఏ. "ప్రయాణీకులు అందరికీ టికెట్లు యిచ్చాడా కండక్టర్" అని అరిచాడు. టికెట్లు ఇచ్చాడనేటప్పటికి, అప్పుడు డ్రయివర్ యిక గత్యంతరం లేక బస్సు స్టార్టుచేశాడు. మళ్ళీ బస్సు జోరుగా బయలుదేరి జగ్గయ్యపేటకు బయలుదేరింది. దారిలో మొత్తం మీద రెండు గంటల ఆలస్యం అయింది మా ప్రయాణం! జగ్గయ్యపేటలో యం యల్.ఏ గారు బస్సు దిగారు. డిపోఆఫీసులోకి వెళ్ళి "మీ డ్రయివర్, కండక్టర్ ప్రయాణీకులని యెక్కించుకోవడం విషయంలో పోట్లాడుకుని రెండు గంటలు ఆలస్యం చేశారు" అంటూ ఫిర్యాదు చేశాడు. "ఇది మా బస్సుల్లో మామూలే! ఓవర్ లోడింగ్ చేసినప్పుడు పేచీ వస్తుంది. ముఖ్యంగా యిద్దరూ చెరొక యూనియన్‌కి చెందిన వాళ్ళు అయినప్పుడు" అని సమాధానం చెప్పాడు బస్సుడిపోలోవున్న అధికారి.

"ఇలాంటివి మీరు అరికట్టలేరా! వీళ్ళ పోట్లాట మూలంగా ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణంలో ఆలస్యం అవుతుంది" అన్నాడు యం. ఎల్. ఏ.. ఆయన డిపోలో కూర్చుని మాట్లాడుతూ వుండగా బస్సు కదిలింది. నేను డ్రయివర్‌తో చెప్పాను కానీ అతను వినిపించుకోలేదు. బస్సు పోనిచ్చాడు. యం. యల్. ఏ. గారి సూట్‌కేసు నాదగ్గర వుండిపోయింది.



నవంబరు 14 వ తేదీ నాడు రాష్ట్రపతి "ఎవరు బాధ్యులు?" అనే బాలల చిత్రాన్ని రాష్ట్రపతి భవనంలో చూచి విజయవాడకి చెందిన రచయిత, నిర్మాత అయిన రాజబాబును అభినందించారు.